www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 4 జులై 2025

భీమవరంలో నేడు నిరసన దీక్ష

పాత బస్టాండ్ వద్ద అల్లూరి మెమోరియల్ హాలు పునఃనిర్మించాలని డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పాత బస్టాండ్ వద్ద అల్లూరి మెమోరియల్ హాలు పునర్నిర్మాణం చేయాలని కోరుతూ ప్రకాశం చౌక్‌లో అల్లూరి మెమోరియల్ పునర్నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన దీక్ష చేపట్టనున్నట్లు నాయకులు ఎం.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు చేపట్టే ఈ దీక్షలో సాధన కమిటీ నాయకులు బి.బలరాం, జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు దీక్షను ప్రారంభించి సంఘీభావం తెలుపుతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మెమోరియల్ హాలు పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లా.. జారుడు బల్లలా..!

బురదమయంగా గ్రామీణ రహదారులు - తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కాళ్ల

మీరు ఇక్కడ చూస్తున్నది సీసీ రోడ్డే. వర్షాల కారణంగా ఇలా దర్శనమిస్తోంది. మండలంలోని చాలా గ్రామీణ రహదారులది ఇదే పరిస్థితి. గతంలో గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లన్నీ పాడయ్యాయి. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించకపోగా నిర్వహణను సైతం గాలికొదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు మంజూరైనట్లు చెబుతున్నా పనులు ముందుకు సాగని పరిస్థితి కన్పిస్తోంది. పంచాయతీలు సైతం ఆర్థిక సంఘం నిధులు అందక పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. దీనికితోడు వేసవిలో ఇష్టానుసారంగా సాగిన మట్టి తోలకాలు రోడ్లను మట్టి రోడ్లుగా మార్చాయి. తాజాగా వర్షం కురవడంతో రోడ్లన్నీ బురదమయమై జారుడు బల్లలుగా మారాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బొండాడ నుంచి గోగుతిప్ప ఆర్అండ్‌బి రోడ్డు, బొండాడ నుంచి బొండాడపేట రోడ్డు, బొండాడ నుంచి కోపల్లె రోడ్డు, సీసలి నుంచి కోమటిగుంట గ్రామీణ రోడ్డు, కాళ్ల నుంచి కోలనపల్లి ఆర్అండ్‌బి రోడ్డు, కాళ్లకూరు నుంచి వెంకటాపురం గ్రామీణ రోడ్డు, ఎల్ఎన్‌పురం, ఆనందపురం, మేకలదిబ్బ, గాంధీనగరం, సత్యనారాయణపురం, సీసలి, కోమటిగుంట, కోలనపల్లి పంచాయతీతోపాటు పలు గ్రామాల్లో పంచాయతీ రహదారులు సైతం అత్యంత దారుణంగా తయారయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే గ్రామాల్లో రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత పంచాయతీ, ఆర్అండ్‌బి అధికారులు దృష్టి సారించి రహదారులు బురదమయం కాకుండా బొండాడ-కోపల్లె రహదారి మెరుగుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాళ్లలో చిత్తడిగా మారిన సీసీ రోడ్డు

తాగునీరు ఇవ్వకపోవడం దారుణం

ఖాళీ బిందెలతో మర్రితిప్ప కాలనీవాసుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

మర్రితిప్ప గ్రామంలోని కాలనీవాసులకు ఎనిమిది నెలలుగా తాగునీరు అందించకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు విమర్శించారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడంపై స్థానికులతో కలిసి కాలనీలో ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ బలహీన వర్గాల కాలనీ ప్రజలకు తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. గతంలో ఈ సమస్యను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని తెలిపారు. వర్షాకాలంలోనూ తాగునీటి సమస్య పరిష్కరించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే గ్రామ సచివాలయం వద్ద పెద్దఎత్తున నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యురాలు గుబ్బల జయలక్ష్మి, నాగళ్ల వరలక్ష్మి, గుబ్బల లక్ష్మి, దాసరి పద్మ, గుబ్బల మౌనిక, గంగుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ - 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జీపు జాతా ప్రారంభం

తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా జీపు జాతాను స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ జాతానుద్దేశించి గోపాలన్, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ 11 జాతీయ కార్మిక సంఘాలు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సంయుక్తంగా ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా మార్పు చేయడం అన్యాయమన్నారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వచ్చాక కార్మికులు సంఘం పెట్టుకునే హక్కుగాని, రెండు సంవత్సరాలకు ఒకసారి అగ్రిమెంట్ చేసుకునే హక్కుగాని, సమ్మె చేసే హక్కుగాని, కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని గంటల పెంపును రద్దు చేయాలని, విశాఖ స్టీల్, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, అధిక ధరలు అరికట్టాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. జాతాలో సిఐటియు నేతలు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, ఎ.అజయకుమారి, హసీనా, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, చిటికిన రాము, నరమాల కృష్ణ, యాసరపు ఎర్రినాయుడు, దేశంశెట్టి సతీష్, పులిమంతుల రమణ, కుంచంగి నానాజీ, గొర్రెల రాజు, ఏపూరి శ్రీను పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడు చేరుకున్న జీపు జాతాకు సిఐటియు, రైతుసంఘం నాయకులు, కార్యకర్తలు పూలతో ఘనస్వాగతం పలికారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిఐటియు మండల అధ్యక్షురాలు జె.శ్యామలకుమారి అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, నేత బంకురు నాగేశ్వరరావు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సిరపరపు రంగారావు, వీరబత్తుల దానయ్య, మాదాసు శ్రీను, తాడి సుబ్బయ్య, ఈదిపిల్లి శేఖర్, దొర్లు సీతయ్య, ఆర్.అనురాధ, కనకమహాలక్ష్మి, కవల రామకృష్ణ పెనగంటి దుర్గా, తాడి అంజి తదితరులు పాల్గొన్నారు.

తణుకు: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈనెల 9న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. జీపుజాతా తణుకు చేరుకున్న నేపథ్యంలో నరేంద్ర సెంటర్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుండి నేటి వరకు కార్మికులకు చేసిందేమి లేకపోగా పోరాటం ద్వారా వచ్చిన వాటిని రద్దు చేయడం అన్యాయమన్నారు. కార్మికుల హక్కులు కాలరాస్తే మరింత పట్టుదలగా ఉద్యమిస్తామని గోపాలన్ హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా బ్రిటీష్‌వాళ్లనే గడగడ లాడించిన చరిత్ర దేశ ప్రజలకు ఉందనే విషయాన్ని మోడీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని జాతా సందర్శించి నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు ఎ.అజయకుమారి, గార రంగారావు, గుబ్బల గోపి, ఎన్.ఆదినారాయణబాబు, మందులయ్య, రామకృష్ణ, పిఎల్.నర్సింహారావు, పి.దక్షిణామూర్తి, షేక్ హసీనా, బ్రహ్మాజీ, సుధాకర్, అయ్యప్ప, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో..

పెనుమంట్ర: సిఐటియు సమ్మె ప్రచార జాతా గురువారం మండలంలోని బ్రాహ్మణచెర్వు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను దుందుడుకుగా అమలు చేస్తుందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, అధిక ధరలు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు స్థానిక నేతలు కోడి శ్రీనివాస ప్రసాద్, కొప్పిశెట్టి పరమేశ్వరరావు, కముజు కిట్టయ్య, చదలవాడ చిన్నబ్బులు, చింతపల్లి అప్పారావు, మంగం సూర్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు మంజూరు చేయాలి

పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. పరిశ్రమల స్థాపనకు వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు యూనిట్ల స్థాపన, పారిశ్రామిక పెట్టుబడులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్మికులందరినీ పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై బీమా పథకాలను నమోదు చేసేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో మే 27 నుండి ఇప్పటివరకు వివిధ పరిశ్రమలు అనుమతుల కోసం 465 దరఖాస్తులు చేసుకున్నారని, వాటిలో 458 దరఖాస్తులను ఆమోదించినట్లు, మరో ఏడు దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. ఎంఎస్ఎంఇలో వివిధ రాయితీ పాలసీ కింద 24 యూనిట్లకు రూ.49.93 లక్షలు మంజూరుకు అనుమతించారు. పిఎంఇజిపి కింద యూనిట్ల స్థాపనకు 568 దరఖాస్తులను బ్యాంకులకు పంపించామని, 342 యూనిట్లు స్థాపించామని, మిగిలిన కూడా త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, ఎంవిఐలు కెఎస్ఎస్.ప్రసాద్, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, జిల్లా విద్యుత్ శాఖాధికారి ఎ.రఘునాథరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్‌విఎస్‌వి.ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, ఏపిఎస్ఎఫ్‌సి డి.అపర్ణ, ఎఫ్ఎపిసిసిఐ మెంబర్ కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పాలకొల్లు

జెఎసి పిలుపు మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు పెద్దఎత్తున నినదించారు. కార్యక్రమంలో నేతలు రాజా భవానీశంకర్, మండెల్ల శ్రీనివాస్ గోపి, పులపర్తి నాగ సూర్య ప్రసాద్, సాలా మల్లేశ్వరరావు, టి.గణేష్, జి.రాజశేఖర్, షేక్ బాబ్జి పాల్గొన్నారు.

పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం: సంక్షేమ పథకాలు అమలు చేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు వేతనాలు రూ.29 వేలకు పెంచాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జెఎసి పిలుపు మేరకు చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజు కొనసాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని నేతలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు మర్రిపూడి సతీష్‌కుమార్, ఈరెల్లి ధనరావు, నున్న శ్రీనివాసరావు, బొడ్డు సూర్యకుమారి, దాసరి పుష్పకుమారి, కూరాకుల ప్రభావతి, ఆర్ఎస్ఎన్.మూర్తి, కోటిపల్లి రాజేష్, శేషగిరి పాల్గొన్నారు.

నరసాపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె గురువారం 11వ రోజు కొనసాగింది. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, వెంటనే విధుల్లో చేరాలని ఎంఎల్ఎ సూచించారు. తాగునీరు, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

పోరాటాలే సమస్యలకు పరిష్కారం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తితో కలిసి లక్ష్మణరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'అల్లూరి త్యాగం-నేటి యువత కర్తవ్యం' అనే అంశంపై సెమినార్ ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షులు బి.గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్త లక్ష్మణరావు మాట్లాడుతూ సమ సమాజం స్థాపించాలని అల్లూరి, భగత్‌సింగ్ పోరాడారని, ఆ క్రమంలో వారి జీవితాలనే అర్పించారని అన్నారు. అల్లూరి మోగల్లులో జన్మించి గిరిజనులను చైతన్యవంతులను చేసి గిరిజనోద్యమాన్ని నిర్మించారన్నారు. అటువంటి మహనీయుల జీవితాలే నేటి విద్యార్థులకు, యువతకు ఆదర్శనీయమన్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మహోద్యమం నడిపించి, ఆదివాసీల హక్కులు, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పని చేయాలన్నారు. నేడు సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, అవి పరిష్కారం కావాలంటే పోరాటమే మార్గమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రొఫెసర్ డాక్టర్ వాణిశ్రీ, ఎస్ఎఫ్ఐ పూర్వపు నేతలు కె.సూర్య, శ్రీనివాస రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, నేతలు ఎస్.లక్ష్మణ్, కె.గోవింద్, కె.రోహిత్, పి.సాయికృష్ణ, కె.హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు



మొగల్తూరు: మంతెన సీతారాంను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

మహోన్నత వ్యక్తి అల్లూరి

సాంస్కృతిక ఉద్యమ నాయకులు మంతెన సీతారాం

మొగల్తూరు: స్వాతంత్రోద్యమంలో బ్రిటీష్ వారిని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని సాంస్కృతిక ఉద్యమ నాయకులు మంతెన సీతారాం అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులపై సాగించిన పోరాటాన్ని సీతారాం వివరించారు. సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స రామరాజు, సిబ్బంది మంతెన సీతారాంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు, దొంగ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వరి పండించే రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక లీడ్‌బ్యాంకు కార్యాలయంలో ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకం సమాచారపత్రాలను అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సంపత్‌కుమార్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వరి పండించే రైతులు ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఎకరానికి రూ.210 ప్రీమియం చెల్లిస్తే రూ.42 వేల వరకు బీమా పొందవచ్చన్నారు. రైతులు దగ్గరలో ఉన్న బ్యాంకులను సంప్రదించి బీమా సౌకర్యం ఉపయోగించుకోవాలన్నారు. బీమా నమోదుకు ఆగస్టు 15 వరకు గడువు ఉందని, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఫసల్ బీమా యోజన పథకం సమాచార పత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వేధిస్తున్న వైద్యుల కొరత..!

ప్రభుత్వానికి పట్టని ఏలూరు సర్వజన ఆసుపత్రి సమస్యలు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చర్చిస్తున్నా సమస్యలకు పరిష్కారం నిల్

ప్రసూతి విభాగంలో ఎనిమిది మందికి ఆరుగురే డాక్టర్లు

గర్భిణుల స్కానింగ్‌కు రేడియాలజిస్ట్‌ను నియమించలేని దుస్థితి

వివిధ విభాగాల్లో 97 మంది డాక్టర్లకు సగం కూడా లేని దుర్భర స్థితి

ప్రజా వైద్యంపై కూటమి సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ అధికారంలోకొచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సమస్యలపై దృష్టి సారించడం లేదు. రోగులకు వైద్య సేవలందించే వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖకు పట్టడం లేదు. కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమస్యలు చర్చిస్తున్నా పరిష్కారం కాని దుస్థితి నెలకొంది. దీంతో పని ఒత్తిడి తట్టుకోలేక డాక్టర్లు, సరిపడా వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి సేవల విభాగానికి ప్రత్యేక స్థానం ఉంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ గర్భిణులకు సేవలందించడంలో అక్కడ పని చేస్తున్న వైద్యుల కృషి ఎనలేనిది. ప్రతిరోజూ సరాసరిన 150 మంది వరకూ గర్భిణులు ఓపి సేవలు పొందేందుకు వస్తుంటారు. ప్రతిరోజూ 15కు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. అందులో కొన్ని ఆపరేషన్ కేసులు, మరికొన్ని నార్మల్ డెలివరీలు ఉంటాయి. ఇంతమంది గర్భిణులకు సేవలందించేచోట పూర్తిస్థాయిలో డాక్టర్లను నియమించకపోవడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. ఎనిమిది మంది డాక్టర్లు ఉండాల్సిన ప్రసూతి విభాగంలో ఆరుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో వైద్యులపై తీవ్రమైన ఒత్తిడి నెలకొంటుంది. ప్రసూతి విభాగంలో గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు రేడియాలజిస్ట్ సైతం లేకుండా పోయారు. ఒక్క రేడియాలజిస్ట్‌ను నియమించలేని స్థితిలో వైద్యోఆరోగ్య శాఖాధికారులు ఉండటం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. రేడియాలజిస్ట్ లేక ప్రయివేటు స్కానింగ్ సెంటర్లకు పంపించాల్సిన పరిస్థితి దాపురించింది. పేదలకు సేవలందించే ప్రభుత్వ బోధనాసుపత్రిలోనే ఈ పరిస్థితి ఉండటం చూస్తే ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఏవిధంగా ఆలోచిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ప్రధానమైన వైద్యుల కొరత పరిష్కారమైతే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుంది. సర్వజన ఆసుపత్రిలో ఇతర విభాగాల్లో పని చేసేందుకు మొత్తం 97 మంది డాక్టర్లు వరకూ అవసరం. ప్రస్తుతం అందులో సగం మంది డాక్టర్లు కూడా లేరు. ప్రతిరోజు వెయ్యికిపైగా ఓపి ఉంటుంది. 300కుపైగా బెడ్స్ ఉన్నాయి. ఈ విధంగా డాక్టర్ల కొరత ఉంటే పేదలకు వైద్యం ఏవిధంగా అందుతుందో ప్రభుత్వమే చెప్పాలి. ముఖ్యమైన గుండె, కిడ్నీ వంటి వ్యాధులను చూసే వైద్యులు ఒక్కరూ కూడా లేకుండాపోయారు. దీంతో సర్వజన ఆసుపత్రి కాస్తా రిఫరల్ ఆసుపత్రిగా మారిపోతుంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్ప ఏలూరు సర్వజన ఆసుపత్రిలో డాక్టర్ల కొరత, ఇతర సమస్యలు తీరే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సమస్యలను గుర్తించి, పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీమ్ పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ పంచాయతీల ఎంపికలో భాగంగా జిల్లాలో 25 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి రామ్ నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సెంట్రల్ టీం కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. ఈ టీమ్ నేటి నుంచి రోజుకు రెండు గ్రామాల చొప్పున జిల్లాలోని 25 గ్రామాల్లో 20 రోజులు పర్యటించనున్నట్లు తెలిపారు. టీమ్ గ్రామాల్లోకి వెళ్లి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించడంతో పాటు గ్రామంలో ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల వినియోగం తీరు ఎలా ఉంది, పంచాయతీలు, స్కూళ్లు, సచివాలయాలు, మార్కెట్ సెంటర్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, చెత్త సేకరణ, డంపింగ్ యార్డుకు తరలింపు తదితర అంశాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమాచారం సేకరిస్తారన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రామ్ నాథ్‌రెడ్డి, స్టేట్ నోడల్ అధికారి ఎస్.సందీప్, డిపిఆర్‌సి ఫీల్డ్ టెక్నికల్ కో ఆర్డినేటర్ ఎన్.ఎడ్వర్డ్, ఎస్‌డబ్ల్యుఎస్ కన్సల్టెన్సీ ఎం.సంతోష్, ఎం.దినేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి – నరసాపురం

రుస్తుంబాదలో రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న రహదారి పనులకు ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రహదారులకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివన్నారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లి ఆదర్శ రాష్ట్రంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. సర్పంచ్ బందెల బాబీ రవీంద్ర, మైలాబత్తుల సోనీ, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, వలవల నాని పాల్గొన్నారు.

పోస్టాఫీసుకు కుర్చీలు అందజేత

ప్రజాశక్తి – గణపవరం

గణపవరం పోస్టల్ కార్యాలయంలో జనం సేద తీరడానికి కుర్చీలు లేకపోవడంతో లయన్స్ క్లబ్ నాయకులు గురువారం 5 కుర్చీలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వి రంగారావు జయంతి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎస్వి రంగారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎస్వి రంగారావు సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు సెంటర్లో ఎస్వి రంగారావు విగ్రహానికి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సమితి ప్రతినిధులు మాకా శ్రీనివాసరావు భోగి రెడ్డి రాము మాట్లాడుతూ ఎస్వి రంగారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోడీకి సిఫారసు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రయివేటు విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి – పెనుమంట్ర

అధికారుల వైఖరికి నిరసనగా ప్రయివేటు విద్యా సంస్థల బంద్ విజయవంతం అయ్యిందని ప్రయివేటు విద్యాసంస్థల సంఘం ప్రతినిధి, విజయ ఇంగ్లీష్ స్కూల్ కరస్పాండెంట్ తేతలి సంజీవ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలువురు ప్రయివేటు విద్యాసంస్థల నిర్వాహకులతో కలిసి విద్యా శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బంద్ చేయిస్తూ, సమస్యలపై చర్యలు రమ్మని కోరుతూ బుధవారం సాయంత్రం సమాచారం ఇచ్చామని విద్యార్థులకు ఆ సమాచారాన్ని పంపలేని పరిస్థితి అని వారు వాపోయారు. అందువల్ల బంద్ యథాతథంగా జరిపామని వారు తెలిపారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి – మొగల్తూరు

మొగల్తూరు కోట రోడ్డులోని దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన జరిగింది. గ్రామానికి చెందిన ముక్కు ఓం వెంకట నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి – వీరవాసరం

ఈ నెల నాలుగో తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గురువారం తెలిపారు. వీరవాసరం, కొణితివాడ, మత్స్యపురి సబ్ స్టేషన్కు వచ్చే లైన్లలో మెయింటెనెన్స్ నిమిత్తం ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలో వీరవాసరం, రాయకుదురు, తోలేరు, వంజా వేమవరం, నందమూరి గరువు, పెర్కిపాలెం, చింతలకోటి గరువు, కొణితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నేలపోగుల ఇండస్ట్రియల్ ఫీడర్ మత్స్యపురి, బొబ్బనపల్లి, వడ్డిగూడెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మొగల్తూరు: కెపి.పాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధు కుమార్ తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటినెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా తీగలకు ఆటంకంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్, కెపి.పాలెంనార్త్, కెపి.పాలెంసౌత్, మెట్రివు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆకివీడు : ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోందని దుంపగడప వివిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థులకు చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రజల్లో చైతన్య తీసుకురావాలన్నారు. రసాయన శాఖ అధ్యాపకురాలు ఇందిర మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా నూలు, గుడ్డ, నార సంచులు వినియోగించాలని సూచించారు. తెలుగు అధ్యాపకులు తంగి ఓగేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : స్థానిక 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్, ధర్మపర అగ్రహారం, దుంపగడప లైన్లకు ఆటంకం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండి : కోలమూరు విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. కోలమూరు, పాములపర్రు, ఉప్పులూరు, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడు గ్రామాల్లో గృహ, ఇండస్ట్రియల్ లైన్లు, ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. యండగండి విద్యుత్ ఉపకేంద్రానికి వెళ్లే 33 కెవి లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నరసాపురం : పట్టణంలో శుక్రవారం వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ రోడ్డు, రాయపేట, ఉమెన్స్ కాలేజీ, సికిలే స్కూల్ రోడ్, ఆస్పత్రి రోడ్డు, మొగల్తూరు, పార్కు రోడ్డు, రాజా ఐస్ ఫ్యాక్టరీ, ఎన్‌టిఆర్ కాలనీలో సరఫరా ఉండదన్నారు.

పెనుమంట్ర : ఈ నెల 4న మండలంలోని నత్తా రామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి, సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం విద్యుత్ ఎఇ కె.మధుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆచంట : మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధు కుమార్ తెలిపారు. వల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని వల్లూరు 11 కెవి విద్యుత్ లైన్‌లో చెట్లు కొమ్మలను తొలగింపు నేపథ్యంలో వల్లూరు, కంబట్లపాలెం, నీరుల్లిపాలెంలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి – నరసాపురం

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సమక్షంలో సీసీ కెమెరాల ఏర్పాటు నిమిత్తం నరసాపురం యువ నాయకుడు, జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ తన వంతుగా రూ.50,000 విరాళం అందించారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో చెక్‌ను శ్రీనివాస్ సోదరి పోలిశెట్టి నాగవేణి చెక్కు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి భీమారావు, డిఎస్‌పి జి.శ్రీవేద, రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్, ఎస్ఐ టి.వెంకట సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి – మొగల్తూరు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరులోని కడలివారిపాలెంలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ గుత్తుల సాయి, మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, మొగల్తూరు పట్టణ అధ్యక్షులు బొల్లా చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డు నిర్మించాలి : సిపిఎం నిరసన

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి – పెనుగొండ

నగరేశ్వరస్వామి కాలనీలో రహదారి అధ్వానంగా ఉందని, రోడ్డును నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి షేక్ బాదుషా అన్నారు. ఈ సందర్భంగా గురువారం సిపిఎం నేతలు కాలనీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరేశ్వర స్వామి కాలనీలో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నారని, ఈ రోడ్డు చాలా అధ్వానంగా ఉందని తెలిపారు. పంచాయతీ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, ఎంఎల్ఎ నిధులతో రహదారులు, డ్రెయినేజీలు నిర్మించాలని, వీధిలైట్లు, తాగునీరు కల్పించాల్సి ఉండగా గ్రామ పంచాయతీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. రాత్రి సమయంలో వీధిలైట్లు లేక ప్రజలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి – ఉండి

ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఉండి, పెదపుల్లేరు రహదారిలోని సొసైటీ మిల్లు వద్ద దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలన్నారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వంజరపు సూర్యనారాయణ, కంది గణపతి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద అజ్జమూరు కాలువ గట్టు నివాసితులు ధర్నా

ప్రజాశక్తి ఆకివీడు

మండలంలోని అజ్జమూరు కాలువ గట్టు నివాసితులు ఇళ్లు ఖాళీ చేయాలంటే అధికారులు ప్రత్యామ్నాయం చూపాలని సిపిఎం ఏరియా కమిటీ డిమాండ్ చేసింది. అజ్జమూరు కాలువ తవ్వకం చేపడుతున్న కారణంగా కాలువ గట్టుపై ఉన్న వారిని ఖాళీ చేయాలని అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. అయితే వారికి ఏ విధమైన ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేయాలనడం తగదని సిపిఎం నాయకులు వారించారు. ఈ మేరకు బాధితులతో కలిసి గురువారం సిపిఎం నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. బాధితులకు ప్రచారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు పెంకి అప్పారావు, బొడ్డుపల్లి రాంబాబు, బాధితులు పాల్గొన్నారు.

దీనిపై తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు స్పందించారు. వెంటనే వారికి తాళ్లకోడులో నివాసయోగ్యమైన స్థలాల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అందుకు బాధితులు తిరస్కరించారు. తమకు ఉన్నచోటే కావాలని అక్కడికి చేరువలోనే ఖాళీగా ఉన్న చెరువు కాలువ గట్ల మధ్య నివాసం ఉంటామని కోరారు. ఆ మేరకు తాత్కాలిక ప్రాతిపదికపై ఉండొచ్చునని తహశీల్దార్ అంగీకరించినట్లు చెప్పారు.

టిడిపి పటిష్టతకు కృషి చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి – తణుకు

టిడిపి పటిష్టతకు వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. టిడిపి తణుకు పట్టణ వార్డు కమిటీల ఎన్నిక ప్రక్రియ గురువారం జరిగింది. ఈ మేరకు తణుకులోని 14, 16, 18, 32 వార్డులకు సంబంధించి నూతన కమిటీలను ప్రకటించారు. ఎంఎల్ఎ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో 14వ వార్డు అధ్యక్షుడిగా దేవిశెట్టి వీరకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కట్టా రామకృష్ణ, 16వ వార్డు అధ్యక్షుడిగా గొల్తి నాగ వెంకట కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఇమ్మణ్ని శ్రీనివాస రాయుడు, 18వ వార్డు అధ్యక్షుడిగా నందా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కొండేపూడి సూర్యనారాయణ, 32వ వార్డు అధ్యక్షుడిగా నల్లా వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఉండ్రాజవరపు వేణుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని ఎంఎల్ఎ అభినందించారు.

ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోకి వదిలితే చర్యలు

ప్రజాశక్తి – కాళ్ల

ఆక్వా చెరువుల నుంచి వ్యర్థ జలాలను నేరుగా పంట కాలువలోకి వదిలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల మత్స్యశాఖ అధికారి ఎం.ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. మండలంలోని జక్కరం, కాళ్ల, బొండాడ గ్రామాల్లో ఆక్వాజోన్ ఏర్పాటుపై గ్రామ సభలు గురువారం నిర్వహించారు. మండల మత్స్య శాఖ అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీటి వసతి ఉన్న భూములకే చేపల చెరువులు తవ్వుకోవటానికి అనుమతులు ఇస్తామన్నారు. భవిష్యత్తులో ఆక్వాజోన్లో లేని సర్వే నెంబర్లకు ఎటువంటి అనుమతులు ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. సర్ద్ డిపిఎం జి.జ్ఞానకుమార్ మాట్లాడుతూ పంట పొలాలకు మురుగు వెళ్లేందుకు బోదెలు ఉండి. చెరువులు తవ్వుకోవటానికి అనుకూలంగా ఉన్న భూములను మాత్రమే ఆక్వా జోనుల్లో చేర్చుతామన్నారు. సంబంధిత సర్వే నెంబర్ల జాబితా ఆయా పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాళ్ల, జక్కరం, బొండాడ గ్రామ సర్పంచులు బందా విజయ, కూచంపూడి పద్మావతి, మన్నే వరలక్ష్మి, విఎఫ్ఒలు జ్యోతి, రాజబాబు, పంచాయతీ కార్యదర్శులు బి.సతీష్ కుమార్, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు గొడౌన్లలో తనిఖీలు

ప్రజాశక్తి – నరసాపురం

ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం పట్టణంలోని ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, గొడౌన్లలో విస్తృ తనిఖీలు నిర్వహించారు. మద్యం, మారకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి జరుగుతున్నాయన్న ప్రభుత్వ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్ అజయ్ కుమార్ సింగ్ చెప్పారు. గొడౌన్‌లో పార్శిళ్లను పరిశీలించారు. అనుమానిత పార్సిల్స్ వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఫణికుమార్ పాల్గొన్నారు.

తణుకు: తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం తణుకులోని నవత, ఎస్ఆర్ఎంటి, క్రాంతి, బ్లూ డాట్, విఆర్ఎల్, డెలివరీ డాట్ కం, శ్రావణి, ఎస్ఎల్ఆర్‌టి, ఆర్‌టిసి కార్గో, రైల్వే పార్సెల్ సర్వీస్ తదితర పార్సిల్ ఆఫీసులు, గొడౌన్లను ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మణికంఠ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం బాటిల్స్, స్పిరిట్, గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు సంబంధించి పార్సిల్ సర్వీస్‌లో నిల్వ, రవాణాలకు అనుమతిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. పార్సిల్ నిర్వహణదారులు పార్సిల్ బుక్ చేసే సందర్భంలోనూ, డెలివరీ చేసే సందర్భంలోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

బాధితులకు కారుమూరి పరామర్శ

ప్రజాశక్తి – తణుకు

అత్తిలి మండలం ఆరవల్లిలో దాడికి గురైన బాధితులను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాల నుండి అన్నదమ్ములుగా కలిసి మెలిసి ఉంటున్న వారి మధ్య కొన్ని దుష్టశక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చులు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాగం ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే రాష్ట్రంలో ఇటువంటి దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆరవల్లి గ్రామ ఉపసర్పంచి వెలగల అమ్మిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షులు బుడితి సుజన్‌కుమార్, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సబ్బితి రాజేష్ పాల్గొన్నారు.

బడివయస్సు పిల్లలందరూ బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

డిఇఒ నారాయణ

ప్రతి పాఠశాల పరిధిలోని ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించాలని, బడి వయసు విద్యార్థులందరూ బడిలోనే ఉండాలని డిఇఒ నారా యణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నాని మాట్లాడారు. సమయానికి ఉపాధ్యాయులు హాజరై విద్యార్థుల అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రతి నెలా సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల నోట్ బుక్స్, టెక్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్ కరెక్షన్స్ ప్రతిరోజు డేట్‌తో సహా అప్‌డేట్ చేయాలన్నారు. ఈ నెల 10న జరగబోయే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకూ స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు వి.హనుమ, పిఎంకె జ్యోతి, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

19న చదరంగం పోటీలు

ప్రజాశక్తి – నరసాపురం

ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా భీమవరం, అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న నరసాపురం పట్టణంలోని సంసిద్ స్కూల్లో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని సంసిద్ స్కూల్ ప్రిన్సిపల్ దుర్గా లావణ్య తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ఆర్‌డిఒ దాసిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసిరాజు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి చదరంగంలో తర్ఫీదు తీసుకోవడం వల్ల బాల మేధావులుగా మారి, ఉన్నత విద్యలో రాణిస్తారని తెలిపారు. నిర్వాహకులు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఐదు వేల రూపాయల విలువైన బహుమతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షులు అల్లు శ్రీనివాస్, సంసిద్ స్కూల్ ఛైర్మన్ వాసా శ్రీనివాసరావు, స్కూల్ మేనేజర్ నారాయణ బాబు పాల్గొన్నారు.

గుడ్డ సంచులు వాడాలి

ప్రజాశక్తి – నరసాపురం

వైఎన్ కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించి, ప్రజలకు గుడ్డ సంచులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని, తద్వారా అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్‌లో కేన్సర్ కారకాలు ఎక్కువ ఉంటాయన్నారు. అందువల్ల ఇటీవల కాలంలో మనం ఎక్కువగా కేన్సర్ రోగులను గుర్తిస్తున్నామని, దీనికి కారణం మనం తెచ్చుకునే పదార్థాలు అన్నింటినీ ప్లాస్టిక్ కవర్లలో తెచ్చుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని నిరోధించాలన్నారు. గుడ్డ సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, కెఎస్‌వి.రంగారావు, డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ చినమిల్లి శ్రీనివాస్, డాక్టర్ అప్పన ఫణి, డాక్టర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

భవానీ ప్రసాద్‌కు నేషనల్ హ్యూమన్ వరల్డ్ రికార్డ్ అవార్డు

ప్రజాశక్తి – పాలకొల్లు

ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయులు జివిఆర్‌విఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్‌ను నేషనల్ హ్యూమన్ వరల్డ్ రికార్డ్ అవార్డు వరించింది. దీనికి సంబంధించి సర్టిఫికెట్‌ను భవానీ ప్రసాద్ స్వయంగా అందుకున్నారు. విద్యా రంగంలో భవానీ ప్రసాద్ చేస్తున్న సేవలకు ఈ అవార్డు లభించిందని నిర్వాహకులు తెలిపారు. భవాని ప్రసాద్ మాట్లాడుతూ సేవ చేయడంలో కలిగే ఆనందం వెల కట్టలేనిదని, పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగంలో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతానని తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ తదితరులు భవాని ప్రసాద్‌కు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మహనీయులు వెంకటావధాని, వెంకటకవులు

ప్రజాశక్తి – ఉండి

జన్మభూమి, తెలుగు భాష కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయులు దివాకర్ల వెంకటావధాని, తిరుపతి వెంకటకవులు అని ప్రముఖ కవి, సహస్రావధాని కోట వెంకట లక్ష్మీ నరసింహ తెలిపారు. దివాకర్ల వెంకటావధాని 113వ జయంతిని యండగండిలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అతిథులు అవధాని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దివాకర్ల సాహితీ సంస్థ అధ్యక్షులు చెరుకువాడ అప్పల రామకృష్ణ వర్మ అధ్యక్షతన జరిగిన సభలో కోట లక్ష్మీ నరసింహ మాట్లాడారు. తెలుగు భాషకు భాష ప్రగతికి జీవితాంతం సేవలు చేసిన అవధాని జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించడం తెలుగు భాషకు యండగండి గ్రామం అందిస్తున్న ఘనమైన కీర్తి పతాకం అన్నారు. గ్రామ పంచాయతీ ఉప సర్పంచి పెన్మత్స జగపతి రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా దివాకర్ల సాహితీ పురస్కారాన్ని బ్రహ్మశ్రీ కోట వెంకట లక్ష్మీనరసింహంకు అందజేశారు. గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చామర్తి లక్ష్మణరావు, యండగండి కోపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్, మాజీ ఉపసర్పంచి వేగేశ్న రామరాజు, దండు సూర్యనారాయణ రాజు, మాజీ ఉపసర్పంచి కన్నా శివన్నారాయణ పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు శిక్షణ

నరసాపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా మహిళా సర్పంచులు ముందుకు సాగాలని డిఎల్‌పిఒ ఐ.జ్యోతిర్మయి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మహిళా సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలను గ్రామ పాలనలో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని 50 శాతం మేరకు పెంచిందన్నారు. ఎంపిపి మైలాబత్తుల సోని, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వికె.వీరభద్రరావు, ఇఒపిఆర్‌డి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, పెన్నాడ గ్రామం, రాజులవీధి, డోర్ నెం: 4-7/1 కు చెందిన గొట్టుముక్కల పార్వతి, W/o. గొట్టుముక్కల వెంకట సుబ్బరాజు అను నేను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం: **W2688278** ది. 01-06-2025 తేదీన నా పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని మా ఇంటి వద్ద నుండి విస్సాకోడేరు సెంటర్‌కు జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో సదరు పాస్‌పోర్టు గల కవరు జారి పడిపోయినది. ఎంత వెతికిన దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

గొట్టుముక్కల పార్వతి
W/o. వెంకట సుబ్బరాజు
డోర్ నెం: 4-7/1,
పెన్నాడ గ్రామం, రాజులవీధి,
పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా
Mobile: 90007 97641

In The Court Of The VII Addl District Judge Com Family Court Eluru, W.G.Dt.
F.C.O.P.No. 42/2025

Between:
గట్టా లక్ష్మీ ...పిటీషనర్
మరియు
గట్టా ఉదయ్‌కుమార్ ...రెస్పాండెంట్

పై నెంబరు గ్రంథంలో గట్టా ఉదయ్‌కుమార్ S/o. సత్యనారాయణ R/o. H.No: 16A-20-67 M.R.C. కాలనీ, ఏలూరు అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 16-07-2025 వ తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొల్లు శ్రీనివాసరావు
సంతోషిమాత
ఏలూరు అడ్వకేట్స్
తేది:03-07-2025 ఏలూరు

CHANGE OF NAME

I, **BARRE DURGA** W/o. Barre Yesu D.No.1-171/B, Nagidipalem Village, Losari Gutlapadu Post, Bhimavaram Mandal, W.G.Dt. I have changed my name from **BARRE LAKSHMI** (Old name) to **BARRE DURGA** (New name) hence forth I am being called **BARRE DURGA** W/o. Barre Yesu for all purposes.

In The Court Of The Hon`ble III rd Addl Civil Judge (Junior Division) Mobaile Court W.G.Dt, Eluru
O.S.No. 413/2023

Between:
Kakarla Nirmala Devi ...Plaintiff
Vs
Kakarla Naga Bhushana Chowda, Rani & others ...Defendants
D3: Smt. Parvathaneni Jaya, W/o. Madhusudhana Rao, R/o. No. 24c-11-10, Manchinellathota, Pathebad, Eluru, Eluru Dist., Eluru JCJC.

పై నెంబరు గ్రంథంలో దావా షెడ్యూలు ఆస్తిలో వాదికి రావలసిన వాటాను పార్టిషను చేసి వాదికి రావలసిన వాటాను ఇప్పించమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబర్ దావాలోను మరియు I.A.No. 192/2023 లో కూడా 3వ ప్రతివాదికి ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 07-07-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల పరోక్షముగా Order pass చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

Ch.S.R. శ్రీనివాస్
ఏలూరు అడ్వకేట్
తేది:01-07-2025 తాడేపల్లిగూడెం

CHANGE OF NAME

I, **KADALI SATYA VARAPU LAKSHMI SRINIVASU** S/o. Kadali Sathya Narayana, D.No. 2-13, Peda Lanka, Peda Sarava Village, Narasapuram Mandal, W.G.Dt. I have changed my name from **KADALI SATAVARAPU LAKSHMI SRINIVASU** (Old name) to **KADALI SATYA VARAPU LAKSHMI SRINIVASU** (New name) hence forth I am being called **KADALI SATYA VARAPU LAKSHMI SRINIVASU** S/o. Kadali Sathya Narayana for all purposes.

మహారాజశ్రీ 8వ అడిషినల్ జిల్లా జడ్జి ప॥గో॥జిల్లా, ఏలూరు
ఒ.ఎస్.నెం. 47/2022

బిట్వీన్ :
దొడ్డా నాగ వెంకట రాధాకృష్ణ ...వాది
మరియు
పెద్దిరెడ్డి వేణు గోపాల కృష్ణారావు వగైరాలు ...ప్రతివాది

వాది తరపు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో 4వ ప్రతివాది అయిన పొన్నూరి శ్రావణి, W/o రామకృష్ణారావు, ద్వారకాతిరుమల, ద్వారకాతిరుమల మండలం, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 23-07-2025 తేదిన ఉదయం గం. 10:30 ని॥లకు** వాయిదా అయి ఉన్నది. కావున స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

అవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్లు, ఏలూరు
ది. 03-07-2025 ఏలూరు జిల్లా

మహారాజశ్రీ 8వ అడిషినల్ జిల్లా జడ్జి ప॥గో॥జిల్లా, ఏలూరు
ఒ.ఎస్.నెం. 47/2022

బిట్వీన్ :
దొడ్డా నాగ వెంకట రాధాకృష్ణ ...వాది
మరియు
పెద్దిరెడ్డి వేణు గోపాల కృష్ణారావు వగైరాలు ...ప్రతివాది

వాది తరపు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో 4వ ప్రతివాది అయిన పొన్నూరి శ్రావణి, W/o రామకృష్ణారావు, ద్వారకాతిరుమల, ద్వారకాతిరుమల మండలం, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 23-07-2025 తేదిన ఉదయం గం. 10:30 ని॥లకు** వాయిదా అయి ఉన్నది. కావున స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

అవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్లు, ఏలూరు
ది. 03-07-2025 ఏలూరు జిల్లా

In The Court Of The Junior Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
O.S.No. 99/2024

Between:
శనపతి పైడమ్మ ...వాది
మరియు
యనమండ్ర రామలక్ష్మి వగైరాలు ...ప్రతివాదులు

To:
1. యనమండ్ర రామలక్ష్మి,
W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D1**)
2. యనమండ్ర విశ్వతేజ,
S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
3. యనమండ్ర వైష్ణవి,
D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన శనపతి పైడమ్మ గారు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 30-07-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 30-07-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్సపార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

శ్రీ ఆల్తి శ్రీనివాస్
శ్రీమతి సుధారాణి
ఎస్. గోపాలకృష్ణ
భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది. 01-07-2025 భీమడోలు
సెల్ నెం: 94909 98949

దేవదాయ ధర్మదాయ శాఖ
భూములు కౌలు టెండర్ - కం - బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, ఉండి మండలం, యండగండి గ్రామములో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానమునకు హక్కుభుక్తములో ఉండి యున్న ఈ దిగువ గ్రామం తాలూకు దిగువ ఉదహరించిన భూమిని 2025-26 సం॥రం నుండి 2027-28 సం॥రం వరకు అనగా 3 సంవత్సరములకు కౌలు హక్కుకు ది. 15-07-2025వ తేదీ మంగళవారం ఉదయం 11.00లకు యండగండి గ్రామములో దేవాలయ ఆవరణములో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు కార్యనిర్వహణాధికారి వారిచే టెండర్-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం.	భూమియున్న గ్రామం పేరు	రీ.సర్వే నెం.	పరిమితి య.సెంట్లు	చెల్లించలసిన ధరావతు
1	యండగండి	253 250/1	5-09 0-04	5000/-
	మొత్తం భూమి		**5-13**	

ముఖ్య షరతులు:
1. ఈ వేలం పాట హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల వారి ఉత్తర్వులకు లోబడి జరుగును. 2. వేలం పాటలో పాల్గొనదలచినవారు ప్రతి వారు ప్రథమ ధరావత్తు రూ. 5000/-లు చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3. ప్రతి పాటదారుడు తనకు గల స్థిరాస్తి వివరములు తెలుపుచూ దస్తావేజు పట్టాదారు పాస్ పుస్తకము మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకుని వచ్చి పాటకు ముందు అధికారులకు ఇవ్వవలెను. లేని యెడల పాటలో పాల్గొనుటకు అర్హులు కారు. 4. హెచ్చు పాటదారుడు పాట సొమ్ములో అనగా ఒక సంవత్సరము సొమ్మును అడ్వాన్సుగా చెల్లించే నిర్ణయం. 5. దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు ఉన్న వారు గాని, లావాదేవీలు గాని ఉన్న వారు పాటలో పాల్గొనరాదు. 6. దేవదాయ ధర్మదాయ శాఖ హిందూ సంస్థ అయినందున హిందువులు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. 7. ఇతర వివరములు మరియు నియమ నిబంధనలు కార్యాలయము పని చేయు వేళలలో వారిని సంప్రదించి తెలుసుకోగలరు.

గ్రామం: యండగండి
తేది: 03-07-2025

ఇట్లు: **కొమ్మిరెడ్డి సూర్యనారాయణ**
కార్యనిర్వహణాధికారి